# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | శుక్రవారం, జనవరి 9, 2026 | సంపుటి:11 | సంచిక : 260 | పేజీలు: 8 | వెల : రూ.5





ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమే
రాజకీయం చేయొద్దు: కేటీఆర్

# ఎంత మంది ఎంత బాధపడినా అమరావతిని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

- విజయవాడలో 'అమరావతి-ఆవకాయ' ఫెస్టివల్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- అమరావతి బెస్ట్ సిటీగా ఎదుగుతుందని, ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేసిన సీఎం
- గత ఐదేళ్లలో పండుగలు లేక ప్రజల్లో నవ్వులు కరువయ్యాయని విమర్శ
- తెలుగు సినిమా, సంస్కృతి, రుచుల వైభవాన్ని చాటిచెప్పడమే ఉత్సవాల లక్ష్యం
- విశాఖను ఏఐ హబ్‌గా, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని ప్రకటన



తెలుగు సంస్కృతి, సినిమా, సాహిత్యం, కళలు, రుచుల సమ్మేళనంగా విజయవాడలో 'అమరావతి-ఆవకాయ ఫెస్టివల్ 2026' అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పున్నమిఘాట్‌లోని ప్రధాన వేదికపై మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన హౌస్ బోట్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతి దేవతల రాజధాని అని, వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎవరు ఎంత బాధపడినా అమరావతిని దేశంలోనే బెస్ట్ సిటీగా, డైనమిక్ సిటీగా తీర్చిదిద్ది తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడను అత్యంత పరిశుభ్రమైన నగరంగా (క్లీనెస్ట్ సిటీ), అమరావతిని పచ్చని నగరంగా (గ్రీన్ సిటీ) మారుస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా నది ఒడ్డున గంట సేపు గడిపితే ఎలాంటి ధ్యానం అవసరం లేదని, అంతటి ప్రశాంతత ఇక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు.

- మిగతా 2వ పేజీలో




## విద్యా సంస్కరణల దిశగా తెలంగాణ ప్రభుత్వం

- యంగ్ ఇండియా స్కూళ్లపై సీఎం ఆదేశాలు
- మొదటి విడతలో బాలికలకు అధిక ప్రాధాన్యం
- ప్రతి నియోజకవర్గంలో బాలురు-బాలికల స్కూళ్లు
- సోలార్ కిచెన్లు, బిల్లుల సకాలంలో విడుదల
- సిలబస్ మార్పులు, విద్యా మౌలిక వసతులు
- నైపుణ్య విద్య, భోజన పథకాల విస్తరణ

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా రూపాంతరం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ , ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలు, భోజన పథకాలు, సిలబస్ మార్పులు, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి అంశాలపై

## చంద్రబాబు ఒక్కరే మన నాయకుడు: నారా లోకేశ్




- తాను కూడా పార్టీకి ఒక సైనికుడినేనని లోకేశ్ ఉద్ఘాటన
- వచ్చే ఎన్నికల్లో గెలిచి చరిత్రను తిరగరాయాలని పిలుపు
- ప్రతి మూడు నెలలకు నేతల పనితీరుపై సమీక్ష ఉంటుందని హెచ్చరిక
- కూటమి పార్టీలతో కలిసి 15 ఏళ్ల పాటు ముందుకు సాగాలని సూచన

## అమేథీ ఓటరు జాబితాలో స్మృతి ఇరానీ




- ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో కీలక అంశం
- మేదాన్ మవాయి గ్రామంలో నమోదు
- 2024 ఎన్నికల్లోనూ ఇదే గ్రామం నుంచి ఓటు
- అమేథీ రాజకీయాల్లో స్మృతి ఇరానీ ప్రయాణం
- ఓటమి తర్వాత కూడా కొనసాగుతున్న అనుబంధం




## భారత్‌పై 500% సుంకాలకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్?


- రష్యా చమురు కొనుగోలే కారణం
- 500% టారిఫ్ బిల్లుకు మద్దతు - లిండ్సే గ్రాహమ్ ప్రకటన
- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై ప్రభావం
- గ్లోబల్ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తత

2026 తొలి ప్రయోగానికి

## సిద్ధమైన ఇస్రో

**ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగం**

- 'అన్వేష'గా పేరు పెట్టిన ఈఓఎస్-ఎన్1 ఉపగ్రహం
- మరొక 15 చిన్న ఉపగ్రహాలు
- స్పెయిన్ స్టార్టప్ రీ-ఎంట్రీ టెక్నాలజీ పరీక్ష
- పీఎస్ఎల్వీకి 64వ ప్రయోగం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి అంతరిక్ష ప్రయోగానికి పూర్తి స్థాయిలో సిద్ధమైంది. ఈ నెల 12వ తేదీన ఉదయం 10:17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ62 (ఈఓఎస్-ఎన్1) రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా ప్రధానంగా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఈఓఎస్-ఎన్1తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను




## భారత్‌పై 500% సుంకాలకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అంతర్జాతీయ వాణిజ్య రాజకీయాల్లో సంచలన నిర్ణయానికి సిద్ధమవడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై, ముఖ్యంగా భారత్, చైనా, బ్రెజిల్ వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తులపై 500 శాతం వరకు సుంకాలు విధించే కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రకటించడం కలకలం రేపింది. రష్యాఉఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా చమురు కొనుగోలు ద్వారా పుతిన్ ప్రభుత్వానికి ఆర్థికంగా బలం చేకూర్చుతున్న దేశాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చాలన్నదే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది. బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) ట్రంప్‌తో జరిగిన కీలక సమావేశం అనంతరం లిండ్సే గ్రాహమ్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. గత కొన్ని నెలలుగా డెమోక్రాట్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెన్‌థల్‌తో కలిసి రష్యాపై మరింత కఠిన ఆంక్షలు విధించేలా ఈ బిల్లును సిద్ధం చేస్తున్నామని, ఇప్పుడు ట్రంప్ పూర్తి మద్దతు లభించడంతో దీనిని వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. వచ్చే వారం ఈ బిల్లుపై అమెరికా కాంగ్రెస్‌లో ఓటింగ్ జరగనుండగా, రిపబ్లికన్, డెమోక్రాట్ పార్టీలకు చెందిన పలువురు సభ్యులు దీనికి మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్, రష్యాఉఉక్రెయిన్ మధ్య సాగుతున్న సుదీర్ఘ యుద్ధాన్ని ముగించాలనే లక్ష్యంతో పలు దౌత్య, ఆర్థిక వ్యూహాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే రష్యాపై నేరుగా కాకుండా, రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై ఆర్థిక ఒత్తిడి పెంచడం ద్వారా పుతిన్‌ను చర్చల టేబుల్ వద్దకు తీసుకురావాలన్న వ్యూహాన్ని ఆయన అనుసరిస్తున్నారని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్, చైనా, బ్రెజిల్ దేశాలపై ట్రంప్ పరిపాలన భారీగా టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత ఉత్పత్తులపై సుమారు 50 శాతం వరకు అమెరికా సుంకాలు అమల్లో ఉండగా, రష్యాతో వాణిజ్యం కొనసాగితే ఈ సుంకాలు మరింత పెంచుతామని ట్రంప్ గతంలోనే స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు ఏకంగా 500 శాతం వరకు సుంకాలు విధించే బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆ హెచ్చరికలను కార్యరూపంలోకి తీసుకొచ్చే దిశగా ఆయన అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ నిర్ణయం అమలైతే భారత ఎగుమతులు, పారిశ్రామిక రంగం, ఐటీ సేవలు, ఔషధ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, భారత్ఉఅమెరికా మధ్య ప్రస్తుతం కీలకమైన ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమే రాజకీయం చేయొద్దు

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, పోలీసుల వ్యవహార శైలి, రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళల భద్రత, ఉద్యోగులుఉరిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, భూ ఆక్రమణలు, పాలమూరుఉరంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల వివాదం వంటి అనేక కీలక అంశాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డా. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమైన ప్రక్రియేనని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో, పురాణ కాలం నుంచి కూడా వేగుల వ్యవస్థ ఉందని గుర్తు చేశారు. మహాభారతం, రామాయణం వంటి పురాణాల్లోనూ రాజుల కాలంలో సమాచార సేకరణ వ్యవస్థ ఉన్నదని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందే, 1885లోనే టెలిగ్రాఫ్ చట్టం అమల్లోకి వచ్చిందని, ఆ చట్టం ప్రకారమే అన్ని ప్రభుత్వాలు ఉ గతంలోనూ, ప్రస్తుతం కూడా ఉ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును ఏ1 నిందితుడిగా చేర్చడం దురుద్దేశపూరితమని డా. ప్రవీణ్ కుమార్ విమర్శించారు. దేశ భద్రత కోసం సేవలందించిన అధికారిని ఈ విధంగా వేధించడం చట్టబద్ధం కాదన్నారు. ప్రభాకర్ రావు దేశానికి అందించిన సేవలను గుర్తు చేస్తూ, కేంద్ర మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఆయనకు అత్యుత్తమ ఇంటెలిజెన్స్ అధికారిగా అవార్డు, దేశ రాష్ట్రపతి చేతుల మీదుగా శౌర్య పతకం, అలాగే ఇండియన్ పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ గ్యాలెంటరీ అవార్డు వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారని గుర్తు చేశారు. ఇలాంటి గౌరవాలు పొందిన అధికారి మీద ఏ1 నిందితుడిగా కేసు పెట్టడం వెనుక స్పష్టమైన రాజకీయ ప్రతీకారం కనిపిస్తోందని అన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, తీవ్రవాదులకే కూడా 14 రోజుల కస్టడీ ఇవ్వని వ్యవస్థలో, ఒక మాజీ పోలీస్ అధికారికి 14 రోజుల రిమాండ్ విధించి, బయట కూడా 200 గంటల పాటు విచారణ జరపడం అమానుషమని వ్యాఖ్యానించారు. ఈ విచారణలో కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ పేర్లు చెప్పాలంటూ తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

## చంద్రబాబు ఒక్కరే మన నాయకుడు: నారా లోకేశ్

"తెలుగుదేశం పార్టీలో మనందరిదీ ఒకటే లైన్, ఒకటే అజెండా ఉండాలి. మన నాయకుడు, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఒక్కరే. నాతో సహా మిగతావారంతా సైనికులం మాత్రమే. నేను కూడా తెలుగుదేశం పార్టీకి ఒక సైనికుడినే" అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీలో నాయకత్వంపై ఎలాంటి సందిగ్ధతకు తావులేదని, చంద్రబాబు నాయకత్వంలోనే అందరూ పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో నూతనంగా నియమితులైన పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జోనల్ కోఆర్డినేటర్లతో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, క్రమశిక్షణ, నాయకుల బాధ్యతలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి చరిత్రను తిరగరాయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లోకేశ్ అన్నారు. "1999లో మాత్రమే మనం వరుసగా రెండోసారి గెలిచాం. ఆ చరిత్రను పునరావృతం చేయాలి. సొంతిల్లు కంటే కిరాయి ఇల్లుపై దృష్టి పెట్టే ధోరణికి ఫుల్ స్టాప్ పడాలి. పార్టీ ప్రయోజనాలే అందరికీ శిరోధార్యం కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పనితీరును ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తామని, ఈ నిబంధన రాష్ట్ర కమిటీకి కూడా వర్తిస్తుందని తేల్చిచెప్పారు. తీసుకునే పది నిర్ణయాల్లో మూడు తప్పులు జరిగినా, వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను ప్రతిఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని లోకేశ్ ఆదేశించారు. "పార్టీ అనేది ఒక వ్యవస్థ, వ్యక్తులపై ఆధారపడకూడదు. అందరూ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి. 'మై టీడీపీ' యాప్ ద్వారా వచ్చే ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలి. మంగళగిరి విజయమే ఇందుకు నిదర్శనం" అని వివరించారు.

# 2026 తొలి ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. కొత్త ఏడాదిలో ఇస్రో చేపట్టనున్న తొలి మిషన్ కావడంతో ఈ ప్రయోగానికి విశేష ప్రాధాన్యం ఏర్పడింది. ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహమైన జూూా-చీ1కు 'అన్వేష' అనే నామకరణం చేశారు. ఈ ఉపగ్రహం భూమి పరిశీలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది. ముఖ్యంగా వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పర్యావరణ పర్యవేక్షణ, భూఉపయోగ మార్పుల అధ్యయనం వంటి కీలక రంగాల్లో దేశానికి కీలక సమాచారం అందించనుంది. పంటల ఆరోగ్యం, నీటి వనరుల స్థితిగతులు, అటవీ విస్తీర్ణం, వాతావరణ మార్పుల ప్రభావాలను విశ్లేషించడంలో ఈ ఉపగ్రహం ఉపయోగపడనుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనివల్ల విధాన నిర్ణయాలకు మరింత ఖచ్చితమైన డేటా అందుబాటులోకి రానుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన రాకెట్, ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని ఇస్రో వెల్లడించింది. ప్రయోగానికి ముందు నిర్వహించాల్సిన తుది తనిఖీలు, భద్రతా పరీక్షలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే అంశాన్ని శాస్త్రవేత్తలు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రయోగం విజయవంతమైతే 2026లో ఇస్రో ప్రయాణానికి ఇది శుభారంభంగా నిలవనుంది. జూూా-చీ1తో పాటు ప్రయోగించనున్న మరో 15 చిన్న ఉపగ్రహాలు వివిధ దేశాలు, సంస్థలకు చెందినవిగా సమాచారం. ఈ చిన్న ఉపగ్రహాలు కమ్యూనికేషన్, పరిశోధన, సాంకేతిక ప్రదర్శనల కోసం ఉపయోగపడనున్నాయి. ఒకే ప్రయోగంలో అనేక ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ఇస్రో సామర్థ్యాన్ని ఈ మిషన్ మరోసారి చాటనుంది. తక్కువ ఖర్చుతో, అధిక నమ్మకత్వంతో ఉపగ్రహ ప్రయోగాలు చేయడంలో ఇస్రో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌లో మరో ప్రత్యేక ఆకర్షణగా స్పెయిన్‌కు చెందిన ఒక స్టార్టప్ అభివృద్ధి చేసిన రీ-ఎంట్రీ వాహనం కూడా ఉంది. 'కెస్ట్రెల్ ఇనీషియల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ణ (ఖ×ణ)'గా పిలవబడే ఈ చిన్న వాహనం, ఉపగ్రహాలన్నింటిని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించనుంది. రీ-ఎంట్రీ సమయంలో ఈ వాహనం ప్రదర్శించే పనితీరును అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తులో రీ-యూజబుల్ టెక్నాలజీల అభివృద్ధికి ఇది దోహదపడనుంది. చివరికి ఇది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో నియంత్రితంగా కూలిపోనుంది. పీఎస్‌ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ ప్రయోగం కాగా, రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన పీఎస్‌ఎల్వీ-డీఎల్ (గూూాం-ఖూ) వేరియంట్‌తో ఇది ఐదో ప్రయోగం కావడం విశేషం. 'ఇస్రో పనివాడు'గా పేరొందిన పీఎస్‌ఎల్వీ రాకెట్ ఇప్పటివరకు అనేక ప్రతిష్ఠాత్మక మిషన్లను విజయవంతంగా పూర్తి చేసింది. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి ఆనవాళ్ల గుర్తింపు, మార్స్ ఆర్బిటర్ మిషన్ ద్వారా అంగారక గ్రహ కక్ష్యలో ప్రవేశం, ఇటీవల ఆదిత్య-ఎల్1 ద్వారా సూర్య పరిశోధన వంటి కీలక విజయాలు పీఎస్‌ఎల్వీ ఖాతాలో ఉన్నాయి. అయితే గత ఏడాది మే నెలలో నిర్వహించిన పీఎస్‌ఎల్వీ-సీ61 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైన విషయం తెలిసిందే. ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో, ఈసారి మరింత జాగ్రత్తగా అన్ని వ్యవస్థలను పరీక్షించి ముందుకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో 2026 తొలి ప్రయోగం విజయవంతమైతే, ఇస్రోపై ఉన్న నమ్మకం మరింత బలపడనుంది.

## ఎంత మంది ఎంత బాధపడినా అమరావతిని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతా



గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పండుగలు, సంబరాలు కనుమరుగై ప్రజల ముఖాల్లో నవ్వులు కరవయ్యాయని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో విజయ ఉత్సవ్, దసరా వేడుకలను ప్రపంచస్థాయిలో నిర్వహించామని గుర్తుచేశారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకొచ్చేవని, ఇప్పుడు విజయవాడ పేరు వినిపించేలా చేశామని అన్నారు. ఆవకాయ అనగానే ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గుర్తుకొస్తుందని, భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ అనే స్థాయికి మన వంటకాల ఖ్యాతి ఉందని కొనియాడారు. తెలుగు సినిమా వైభవాన్ని ప్రస్తావిస్తూ, 'భక్త ప్రహ్లాద' నుంచి 'బాహుబలి' వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో శిఖరాలను అధిరోహించిందని అన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణా జిల్లా నుంచే వచ్చి చిత్రసీమకు దిక్సూచిగా నిలిచారని, నేడు పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారు దాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. సంపద సృష్టిలో, వ్యాపార చతురతలో కృష్ణా జిల్లా ప్రజలు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, విశాఖపట్నాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ద్వారా ఇళ్లలోనే గ్యాస్ తయారుచేసుకునే సాంకేతికతను అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవని, పర్యాటకం, సాంకేతికతతో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఉత్సవాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత విజయవాడ ప్రజలదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు.

### విద్యా సంస్కరణల దిశగా
## తెలంగాణ ప్రభుత్వం

విస్తృతంగా సమీక్షించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశం తెలంగాణ విద్యా విధానానికి భవిష్యత్ దిశను నిర్దేశించిన కీలక మలుపుగా నిలిచింది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మొదటి విడతలో పూర్తయ్యే స్కూల్స్‌లో ఎక్కువ శాతం బాలికలకు కేటాయించాలని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారు. బాలికల విద్యే సమాజ అభివృద్ధికి పునాదని పేర్కొంటూ, మొదటి దశలోనే బాలికలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సామాజిక సమానత్వం, విద్యలో అవకాశాల సమానత్వం బలోపేతం అవుతుందని అన్నారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక బాలుర, ఒక బాలికల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ చొప్పున నిర్మాణాలు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఇది దేశంలోనే అరుదైన, విస్తృత స్థాయి విద్యా మౌలిక సదుపాయాల విస్తరణగా మారనుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం బాలికలకు కేటాయించిన నియోజకవర్గాల్లో, తదుపరి విడతలో బాలురకు కూడా ఇదే తరహా స్కూల్స్ కేటాయించాలని సీఎం సూచించారు. తద్వారా ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలు ఇద్దరికీ సమానంగా నాణ్యమైన రెసిడెన్షియల్ విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ స్కూల్స్‌ను కేవలం పాఠశాలలుగా కాకుండా, మినీ యూనివర్సిటీ తరహాలో సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు అన్నీ ఒకే ప్రాంగణంలో అందేలా అభివృద్ధి చేయాలనే దృక్పథన్ని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు.

## మాది సంక్షమ క్యాలెండర్.. బాబుది అప్పుల క్యాలెండర్

అమరావతి: 'మా ప్రభుత్వంలో ప్రతి ఏటా సంక్షమ క్యాలెండర్ విడుదల చేసి, దాన్ని క్రమం తప్పకుండా అమలు చేశాం. అదే ఇప్పుడున్న చంద్రబాబు అప్పులు తెచ్చుకోవడానికి క్యాలెండర్ విడుదల చేస్తున్నారు' అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దునుమాడారు. తమ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.3.31 లక్షల కోట్ల అప్పు చేస్తే.. రెండేళ్లు కూడా తిరక్కముందే రూ.3.02 లక్షల కోట్లు.. అంటే తాము ఐదేళ్లలో చేసిన అప్పులో 90.87 శాతం అప్పును చంద్రబాబు ప్రభుత్వం ఈ 18 నెలల్లోనే చేసేసిందంటూ కాగ్ నివేదికల్లో గణాంకాలను చూపుతూ కడిగిపారేశారు. ఇన్ని అప్పులు చేస్తున్న చంద్రబాబు ప్రజలకేమైనా మేలు చేశాడా? అంటే అదీ లేదన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేకుండా పోయాయని, వైఎస్సార్‌సీపీ హయాంలో అమలైన పథకాలన్నీ రద్దు చేసేశారని నిప్పులు చెరిగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ గాలికి పోయాయని ఎద్దేవా చేశారు. రైతులు, విద్యార్థులు, అక్కచెల్లెమ్మలు, ఉద్యోగులకు దిక్కులేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు దాదాపుగా రూ.30 వేల కోట్లు బకాయి పడిందని చెప్పారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ ఊసే లేదన్నారు. ఇక సరెండర్ లీవుల గురించి చెప్పాల్సిన పనే లేదన్నారు. చంద్రబాబు పదే పదే తప్పులు చేస్తూ.. మరో వైపు దు?రష్పచారం చేస్తుంటారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.10 లక్షల కోట్ల నుంచి రూ.14 లక్షల కోట్ల మేర అప్పులు చేసేశారని ఎన్నికలకు ముందు దు?రష్పచారం చేశారు. ఇప్పుడు కూడా చంద్రబాబును ఎవరైనా గిల్లినా, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ ఎందుకు ఇవ్వడం లేదని నిలదీసినా, ఉద్యోగులు సమ్మెల్లోకి వెళ్లినా మళ్లీ మనమే గుర్తుకొస్తాం. అసెంబ్లీలో ఒకటి చెబుతారు. ప్రభుత్వ రికార్డుల్లో ఒకటి చూపుతారు. బహిరంగ సభల్లో ఇంకో మాట మాట్లాడతారు. ? 2014లో బాబు గద్దెనెక్కే నాటికి ప్రభుత్వ అప్పులు, రాష్ట్ర ప్రభుత్వ హామీతో తీసుకున్న అప్పులు, హామీ లేని రుణాలు అన్నీ కలిపి రూ.1,40,717 కోట్లు ఉన్నాయి. ఈ అప్పులు చంద్రబాబు దిగిపోయే నాటికి రూ.3,90,247 కోట్లకు చేరాయి. ఈ లెక్కన ఆయన రూ.2,49,530 కోట్లు అప్పు చేశారు. అంటే.. చంద్రబాబు సర్కార్ హయాంలో రుణాల సగటు వార్షిక వృద్ధి రేటు(సీఏజీఆర్) 22.63 శాతం నమోదైంది. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3,31,671 కోట్లు అప్పు చేశాం. ఈ లెక్కన గమనిస్తే అప్పుల్లో సీఏజీఆర్ 13.57 శాతం మాత్రమే ఉంది. చంద్రబాబు ఓ వైపు అప్పులు చేస్తూనే, మరో వైపు ప్రజల మీద విపరీతంగా బాదేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఐదేళ్లపాటు కరెంటు చార్జీలు పెంచనని చంద్రబాబు అన్నారు. కానీ, రెండేళ్లు కూడా గడవకుండానే ఏకంగా రూ.20,135 కోట్ల కరెంటు చార్జీలు బాదారు.

## అమేథీ ఓటరు జాబితాలో స్మృతి ఇరానీ

ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంశం వెలుగులోకి వచ్చింది. మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకురాలు స్మృతి ఇరానీ పేరు అమేథీ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన ఓటరు జాబితాలో అధికారికంగా నమోదు అయ్యింది. అమేథీతో తన రాజకీయ, వ్యక్తిగత అనుబంధాన్ని మరోసారి స్పష్టం చేస్తూ ఆమె ఓటరు హక్కును అక్కడే కొనసాగించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. అమేథీ నియోజకవర్గంలోని గౌరీగంజ్ అసెంబ్లీ పరిధిలో ఉన్న మేదాన్ మవాయి గ్రామానికి చెందిన ఓటరు జాబితాలో స్మృతి ఇరానీ పేరు చేర్చినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ గ్రామంలో ఇటీవల ఆమె కొత్తగా ఇంటిని నిర్మించుకున్నారు. ఇదే చిరునామాను ఆధారంగా తీసుకుని ఆమె ఓటును నమోదు చేసినట్లు తెలుస్తోంది. మేదాన్ మవాయి కంపోజిట్ స్కూల్ లీలా టిక్రా మవాయి పోలింగ్ స్టేషన్‌లో 514 సీరియల్ నెంబర్‌లో స్మృతి ఇరానీ పేరు నమోదై ఉంది. ?? పోలింగ్ స్టేషన్‌లో మొత్తం 666 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై బీజేపీ అమేథీ జిల్లా అధ్యక్షుడు సుధాన్షు శుక్లా స్పందిస్తూ, స్మృతి ఇరానీ గతంలోనూ ఇదే గ్రామం నుంచి ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ముఖ్యంగా 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా ఆమె మేదాన్ మవాయి గ్రామం నుంచే తన ఓటును నమోదు చేసుకుని, అక్కడే ఓటు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. అమేథీతో స్మృతి ఇరానీకి విడదీయలేని అనుబంధం ఉందని, రాజకీయంగా గెలుపోటములు ఎలా ఉన్నా ఈ నియోజకవర్గంతో ఆమె బంధం కొనసాగుతూనే ఉందని శుక్లా వ్యాఖ్యానించారు. స్మృతి ఇరానీ అమేథీ రాజకీయాల్లో 2014 నుంచి చురుకుగా ఉన్నారు. ఆ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ఆమె పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఆ ఓటమి తర్వాత కూడా అమేథీని వదలకుండా అక్కడే ప్రజల మధ్య ఉండటం ఆమె రాజకీయ వ్యూహంలో కీలకంగా మారింది. ఫలితంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీపై సంచలన విజయం సాధించి, అమేథీ నుంచి ఎంపీగా గెలిచి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆ విజయం ఆమె రాజకీయ జీవితంలో మైలురాయిగా నిలిచింది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితులు మారాయి. కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ చేతిలో స్మృతి ఇరానీ ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ అమేథీతో తన అనుబంధాన్ని తెంచుకోకుండా, అక్కడే నివాసం కొనసాగించడం రాజకీయంగా విశేషంగా మారింది. ఓటమి వచ్చినా అమేథీనే తన రాజకీయ కేంద్రంగా భావిస్తారన్న సంకేతాలను ఆమె చర్యలు ఇస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. మేదాన్ మవాయి గ్రామంలో 2021 ఫిబ్రవరిలో స్మృతి ఇరానీ సుమారు 1100 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో ఇల్లు నిర్మించి, 2024లో గృహప్రవేశం కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఆమె నివాస చిరునామా కూడా అధికారికంగా అదే గ్రామంగా నమోదు కావడంతో, ఓటరు జాబితాలో పేరు చేర్చడం సహజ ప్రక్రియగా అధికారులు చెబుతున్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలకు అందాలి









పటాన్చెరు, నవతరం: భక్తి సేవ సత్సంకల్పానికి ప్రతీకగా ఒక అందమైన కార్యక్రమాన్ని నిర్వహించిన మాద్రి పృథ్వీరాజ్. పటాన్చెరువు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో ప్రతి శనివారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలను ప్రోత్సహిస్తూ, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా వంటి పవిత్ర గ్రంథలను అందజేసిన మాద్రి పృథ్వీరాజ్. ఈ సందర్భంగా మహిళల ఆధ్యాత్మిక నిబద్ధతను అభినందిస్తూ, మన సంస్కృతిఉసంప్రదాయాలు తరతరాలకు అందాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మహిళలు తెలిపారు. భక్తి మార్గంలో మహిళల పాత్రను గుర్తించి, ఆధ్యాత్మిక చైతన్యానికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పృథ్వీరాజ్ అన్నారు.





## ప్రియుడు అనుమానించాడని

# యువతి ఆత్మహత్య?

రంగారెడ్డి జిల్లా, జనవరి 08, నవతరం: ప్రేమిస్తున్నానని వెంట పడ్డాడు పెళ్లి చేసుకోవడా నికి తల్లిదండ్రులను ఒప్పించాడు ఫోన్లో ఎవరితో నో మాట్లాడుతున్నావని వేధించడంతో యువతి వాటర్ ట్యాంక్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది, ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగోల్ లో జరిగింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం సమీపంలోని కొత్తగూడెం పట్టణానికి చెందిన ఐశ్వర్య (19) తన అన్న అరవింద్‌తో కలిసి తట్టి అన్నారంలోని వైఎస్ఆర్ కాలనీలో అద్దెకు ఉంటోంది. అయితే వీరికి దూరపు బంధువైన మహేష్ అలియాస్ ఆనంద్ (23) తో పరిచయం ఏర్పడింది. ఐశ్వర్య ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. కాగా సూర్యాపేటకు చెందిన వీరి దూరపు బంధువైన మహేష్ అలియాస్ ఆనంద్,( 23) నగరంలోని హస్తినా పురంలో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. ఆనంద్ దూర బంధువు కావడంతో పలుమార్లు ఐశ్వర్య వాళ్ళ ఇంటికి వచ్చేవాడు వీరిద్దరి మధ్య పరిచయం కూడా ఏర్పడింది.. ఏడాది క్రితం జరిగిన అయ్యప్ప పూజలో ఐశ్వర్యను చూశాడు. అప్పటి నుంచి తరచూ ఐశ్వర్య ఇంటికి వచ్చేవాడు. ఇటీవల ఆమెను ప్రేమిస్తు న్నానని, పెళ్లి చేసుకుంటా నని వెంటపడ్డాడు. దాంతో ఆ యువతి ఒప్పుకుంది. అయితే వారి పెళ్లికి మొదట పెద్దలు నిరాకరించారు. తర్వాత నచ్చజెప్పడంతో ఒప్పుకున్నారు. ఈ క్రమంలో ఐశ్వర్య మరెవరితోనో ఫోన్లో మాట్లాడుతోందని ఆనంద్ అనుమానం పెంచుకున్నాడు. జనవరి 5వ తేదీన హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వద్దకు ఇద్దరు చేరుకొని మాట్లాడుకున్నారు. ఫోన్లో ఎవరితో మాట్లాడుతున్న వని అనుమానం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్థాపానికి చెందిన ఐశ్వర్య వెంటనే వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి దూకేసింది. వెంటనే ఆమెను నాగోల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేష్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అనిశా వలలో అవినీతి పోలీస్ అధికారి




## 15 వేలు లంచం

## తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ పోలీస్ అధికారి!

హన్మకొండ జిల్లా, జనవరి 08, నవతరం: లంచం తీసుకోవడం నేరము అని అవగాహన కల్పించవలసిన కొంతమంది పోలీస్ అధికారులే లంచాలకు ఆశపడుతున్నారు. లంచగొండి ఉద్యోగులను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని చర్యలు తీసుకుంటున్నప్ప టికీ కొందరు అధికారుల తీరులో ఏ మాత్రం మార్పు రావడం లేదు.. ఈ నేపథ్యంలోనే గురువారం వరంగల్ కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్ ను ఏసీబీ అధి కారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇటీవల పేకాట కేసులో పట్టుబడ్డ వ్యక్తి నుంచి 15వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. పేకాటలో పట్టుబడ్డ వ్యక్తి కి సంబంధించిన వాహనాన్ని, మొబైల్ ఫోన్ ను తనకు అప్పగించేందుకు ప్రైవేట్ డ్రైవర్ ద్వారా ఎస్సైని సంప్రదించాడు. దీంతో ఎస్సై శ్రీకాంత్ 15 వేలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం మధ్యాహ్నం కేయూ జంక్షన్ వద్ద రూ. 15 వేలు లంచం తీసుకుంటుం డగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ప్రైవేట్ డ్రైవర్‌ను, ఎస్సైను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

## పంట పొలంలో ప్రజా నాయకుడు

### ::: వ్యవసాయ పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు



హైదరాబాద్, జనవరి 8,నవతరం: ఎప్పుడూ రాజకీయ కార్యక్రమాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే ప్రజా నాయకులు నేరుగా పంట పొలాల్లోకి దిగితే అది సమాజానికి ఒక బలమైన సందేశం. ఆ సందేశాన్ని కార్యరూపంలో చూపించారు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు. తన వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా ట్రాక్టర్ నడిపి పొలం దున్నుతూ, వ్యవసాయ పనుల్లో పాల్గొన్న శంబీపూర్ రాజు రైతు జీవితాన్ని దగ్గరగా అనుభవించారు. వ్యవసాయం మాటలకే పరిమితం కాకుండా, చేతలతో చేయాల్సిన జీవన విధానం అన్న భావనను ఆయన ఈ సందర్భంగా చాటారు. రైతుల కష్టాలు, పంట పండించే శ్రమ, నేల విలువ ఇవన్నీ క్షేత్ర స్థాయిలో అనుభవించినప్పుడే పాలకులకు అర్థమవుతాయని శంబీపూర్ రాజు పేర్కొన్నారు. నాయకుడు అంటే కార్యాలయాల్లో కూర్చోవడమే కాదు, అవసరమైతే మట్టిలో కాళ్లు మోపి రైతుతో కలిసి నడవాలన్న ఆలోచనకు ఇది ప్రతీకగా నిలిచింది.యువత వ్యవసాయం వైపు ఆకర్షితులవ్వాలన్న ఉద్దేశంతో తాను స్వయంగా వ్యవసాయ పనుల్లో పాల్గొంటున్నానని, వ్యవసాయ రంగం భవిష్యత్‌కు బలమైన పునాదిగా మారాలని ఆయన ఆకాంక్షించారు.

## వరంగల్ చౌరస్తాలో

# కత్తితో వివాహిత హల్చల్

వరంగల్ : వరంగల్ చౌరస్తాలో ఒక వివాహిత కత్తితో హల్ చల్ చేసింది. భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని కత్తితో దాడికి ప్రయత్నం చేసింది. భర్త దుకాణం వద్దకు అకస్మాత్తుగా కత్తితో వచ్చి తనకు రావాల్సిన ఆస్తితో పాటు పిల్లలను తనకు ఇవ్వాలని హల్చల్ చేసింది. భార్య నుండి తప్పించుకునేందుకు తన జ్యువెలరీ షాపులో దాక్కొని భర్త డయల్ 100కి ఫోన్ చేసాడు. పోలీసులు వచ్చి యువతి చేతిలోని కత్తిని లాక్కున్నారు. దాంతో వివాహిత జ్యోత్స్న రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగింది. తన భర్త శ్రీకాంత్ అక్రమ సంబంధం పెట్టుకొని తనకు విడాకులు ఇస్తున్నాడని ఆరోపించింది. భర్త శ్రీకాంత్ విడాకుల కోసం కోర్టుకు వెళ్లాడు. పోలీసులు వివాహితకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసారు.


దిహోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్

Plot No. 174 to 176, phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051. 9391221697

చదువుకునే పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం

బి. యస్. రెడ్డి నగర్ ఫేజ్ - 1 ఐకాం ఎదురుగా చర్లపల్లిలో 1996 సం॥లో "ద హోంఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్" అనే విద్యార్థుల వసతి గృహము స్థాపించబడినది. ఈ సంస్థ నగరంలోని దాతల సహకారంతో నడుపబడుచున్నది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమంటే బాగా చదువగలిగి ఉండి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసేవారిని కూలీలుగా కార్మికులుగా మారకుండా సమాజానికి పనికివచ్చే మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని. గ్రామీణ పేద విద్యార్థులకు హైదరాబాద్ నగరంలో ఉండి చదువగలిగే ఆర్థిక స్తోమత లేనివారికి వసతి, భోజనం, పుస్తకాలు, నోట్‌పుస్తకాలు. బస్‌పాస్ మరియు పరీక్షఫీజులు కూడా చెల్లించి వారి భావి జీవితము అత్యున్న తంగా ఉండేలా తీర్చిదిద్దాలని మా ఆశయం.

ఇందులో అడ్మిషన్ పొందగలిగే విద్యార్థులకు కులము. మతము పట్టింపులు ఏమీ ఉండవు. ఇందులో చదువుకోదలచిన విద్యార్థులకు నగరంలో ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొంది ఉండవలెను మంచి మార్కులు వచ్చిన అనాథ విద్యార్థులకు తల్లి లేదా తండ్రి లేనివారికి గ్రామీణ పేద విద్యార్థులకు మేనేజ్‌మెట్ తరవున కళాశాల యాజమాన్యంతో సంప్రదించి వీలైతే ఏదైనా మంచి కళాశాలలో ఫ్రీ అడ్మిషన్ ఇప్పించుటకు మా వంతు కృషి చేయగలము.

ఈ సంస్థ స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఇందులో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననల్ని పొందుచున్నారు సుమారు 400 మంది గత 29 సం॥లలో ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు

ఇందులో అడ్మిషన్ కోరకై విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి (ఇంటర్ 1. 2. ఏదైనా డిగ్రీ ఫస్ట్ ఇయర్‌వారు) దరఖాస్తుకు అర్హులు గ్రామీణ అనాథ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది తల్లి లేదా తండ్రి లేని నిరుపేద విద్యార్థులు. పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చును. విద్యార్థులు తమ మార్కులకు సంబందించిన మెమా. అదే విధంగా బోనోఫైడ్ సర్టిఫికేట్స్ (ప్రస్తుతం చదువుతున్న కళాశాలకు సంబంధించినది). తల్లిదండ్రులు లేనిచో మరణ ధృవీకరణ పత్రము ఆదాయం సర్టిఫికేట్ (ఎం.ఆర్.ఓ. గారిచే ధృవీకరించబడినది అయి ఉండాలి). అన్ని సర్టిఫికేట్స్ యొక్కజిరాక్స్ కాపీలను మరియు రెండు పాస్‌పోర్టుసైజు పోటోలను పోంత చిరునామా కలిగిన స్టాంపులు అంటించి కవరును పోస్టు ద్వారాగాని. ఇమెయిల్ ద్వారాగాని. వాట్సప్ (9391221697) ద్వారాగాని. స్వయంగా గాని పైన ఉన్న చిరునామాకు వెంటనే పంపించగలరు. పూర్తి వివరాలకుపైన నెంబర్లకు సంప్రదించగలరు.

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అడ్రస్ కొరకు SCAN చేయండి

మనవి : కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు చదువుకునే పదవతరగతిలో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులను ప్రోత్సహించి మా హోం కు పంపించగలరు.

గమనిక: ఈ వసతి కేవలం బాలురుకు మాత్రమే

Bittu Digitals Aler - 8919441120



ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్ | THE HOME FOR ORPHAN STUDENTS

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.



పదవ తరగతి పై బడిన చదువుతున్న ఇంటర్మీడియట్/ఐ.టి.ఐ/ పాలిటిక్నిక్/ డిగ్రీ/ ఇంజనీరింగ్/ పారా మెడికల్ కోర్సులు/ పి.జి కోర్సులు.

A golden Opportunity for Orphaned and underprivileged students studying Intermediate, ITI, Polytechnic, Degree, Engineering, Paramedical, or PG Courses after completing 10th class.

హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న అనాథ/ పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం.

Students Studying in Government or Private Colleges in Hyderabad are Eligible.

మానవత్వం సహృదయం గల దాతల హార్ధిక, ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడుచున్న సంస్థ. గత 30 సం॥లలో సుమారు 400 మంది విద్యార్థులు ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు.

With the support of kind-hearted and humanitarian donors, an organization is being run since last 30years about 400plus students studied and well setteled down happily in life.

బాలురకు మాత్రమే

ఉచిత వసతి, భోజనం, బస్‌పాస్, సౌకర్యాలతో

SCAN HERE For ADDRESS

ONLY FOR BOYS

Free Accommodation
Free Meals
Free Bus Pass
Other Essential Facilities.

అడ్మిషన్ల కొరకు పైన పేర్కొన్న అడ్రస్ లో సంప్రదించగలరు. | For Addmissions Please Contact the Address Mentioned Above

Cell: 9391221697



# మణుగూరులో సిండికేట్... కేటుగాడు!

- ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే దందా?
- అక్కడ సిండికేట్ వ్యాపారి చెప్పిందే ధర!
- బెల్ట్ షాపులకు దర్జాగా తరలిస్తున్న మద్యం!
- కోట్లలో దండుకుంటున్నా వెంక్కన్న !
- ఈ బడా వ్యాపారులపై చర్యలు ఉండవా?
- నాటు సారా పట్టివేతలో ఎక్సైజ్ అధికారుల బిజీబిజీ!!
- లిక్కర్ మాఫియాకు అడ్డుకట్ట పడేది ఎప్పుడు?



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 8, స్పెషల్ కరస్పాండెంట్, నవతరం: సిండికేట్ వెంకన్న... చదువుతుంటే.. సినిమా డైలాగ్ లాగా అనిపించినా ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిసర ప్రాంతాలలో వినిపించే ఫేమస్ నేమ్స్ వారు నడిపిస్తున్న దందా చూస్తే.. ఎవరైనా అలానే పిలుస్తారు.వారు వైన్ షాపులు దక్కించుకున్నాడంటే చాలు వైన్ షాపుల నిర్వాహకులను సిండికేట్ చేసేస్తారు. ఇక వారికీ అనుకూలంగా ఉన్న బెల్టు షాపులకు మద్యం పోయినట్లే, ధరలు పెరిగినట్టే. ప్రతీ గ్రామానికి బెల్ట్ షాపులొచ్చినట్లే. డోర్ డెలివరీ సార్ట్ అయినట్లే. అంతేకాదు.. సిండికేట్ అయిన ఏరియాల్లో నలుగురైదుగురితో ఓ టీం ఏర్పాటు చేసి బెల్ట్ షాపుల్లో తనిఖీలు చేయిస్తారు. ఒక వేళ వేరే ఏరియా నుంచి సరుకు వస్తే ఇంక అంతే. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోరా అంటే.. ఈ సిండికేట్ కేటుగాళ్ల కు కొంత మంది ఎక్సైజ్ అధికారులను మచ్చిక చేసుకొని నెలనెలా మామూళ్లు పంపిచేస్తాడనే ఆరోపణ ఉంది. దందాకు అధికార పార్టీ అండ ఎలాగూ ఉండనే ఉంది. ఇకా అడ్డుకునే వారెవరుంటారు మరి? అందుకే దందా మూడు బీర్లు.. ఆరు ఫుల్లులుగా నడుస్తోంది...మణుగూరు మరియు ఆనుకొని ఉన్న మండలలో వైన్స్ సిండికేట్ గ్యాంగ్లు వీరి కనుసన్నల్లో నడుస్తోంది. బెల్ట్ షాపులకు మద్యం తరలింపు.. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ, రేట్ ఫిక్స్ ఇలా అన్ని వారి కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. ఎవరికి ఎంత ఇవ్వాలనేది కూడా వారే నిర్ణయిస్తారాటా. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు చుట్టుపక్కల మండలాల్లో సిండికేట్ వ్యాపారాన్ని అధికారులు పట్టించుకోకపోవడానికి వీరే కారణమని వినిపిస్తున్నది. తమ చెప్పుచేతల్లో ఉండే అధికారులకు అడిగినంత ముట్టజెబుతూ తమ మాఫియాను పదిలంగా కాపాడుకుంటున్నారు. వైన్స్ షాపుల నిర్వహణలో ఆరితేరిన వెంకన్న ఎక్కడ వైన్స్ దక్కించుకున్నా సిండికేట్ జట్టు ఏర్పాటు చేస్తారని తెలుస్తున్నది.పల్లెల్లో బెల్ట్ షాపులను ప్రోత్సహించారు. అధికారులను తమ వైపు తిప్పుకోని యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. మణుగూరు పరిధిలో వారికి అనుకూలంగా ఉన్న చోట గదులను అద్దెకు తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని పల్లెలకు తరలిస్తున్నారు.

### 1500పైగా బెల్ట్ షాపులు

మణుగూరు మండల కేంద్రాల చుట్టూ ఉన్న గ్రామాల్లో సుమారు 1500 వరకు బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం. పక్కగా లెక్కిస్తే ఇంకా లెక్క ఎక్కువగా నే ఉంటుందని ప్రజా సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇవన్నీ సిండికేట్ ముఠా మాటునే నడుస్తున్నాయని తెలుస్తున్నది. అక్కడి నుంచే ఆటోలు, మారుతి ఎట్టికా కార్లల్లో నేరుగా బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. మరి ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోరా అంటే.. కనీసం చర్యలు కూడా తీసుకోరు.

వైన్స్ లోనే ఒక కౌంటర్ నుండి మందు బాబులకు విక్రయిస్తారు. మిగతా రెండింట్లోనూ కేవలం బెల్ట్ షాపులకే మందును విక్రయిస్తారు. బీరు, క్వాటర్ పై పది రూపాయలు, ఆఫ్ పై రూ.20, ఫుల్ బాటిల్ రూ. 40 చొప్పున పెంచి బెల్ట్ షాపులకు విక్రయిస్తారు. ఈ రెండు షాపుల్లోనూ మందు బాబులకు మద్యం విక్రయించరనేది ఈ మండలాల్లో మొత్తం తెలిసిన విషయం. ఇందేటని అడిగితే దబాయింపే తప్పా.. సమాధానం ఎవరూ చెప్పరు. అధికార పార్టీ అండ ఉంది కాబట్టి అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే వారుండరు.

### బెల్ట్ షాపులలో అధిక ధరలకు వసూళ్లు?

ఓ సామాన్యుడు రోజంతా కూలి, నాలి చేసి సాయంత్రం ఒక క్వాటర్ వైన్ షాప్ లో తనకు ఇష్టమైన మద్యం సేవిద్దామంటే అది అక్కడ ఉండదు! ఆ వైన్ షాప్ పక్కనే అనుకొని ఉన్న ఓ బెల్ట్ షాపులలో అదే మద్యం అడగంగానే ప్రత్యక్షమవుతుంది?. తీరా రేట్ చూస్తే వైన్ షాప్ కంటే సుమారు 40,50 రూపాయలు... ఉదాహరణకు: రాయల్ స్టాగ్ క్వాటర్ ధర వైన్స్ లో 220, అదే బెల్ట్ షాప్ లో 260 ఎలా అవుతుంది? అదే సిండికేట్ వెంకన్న మాయాజాలం.



### ఎక్సైజ్ అధికారులెక్కడా..?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , మణుగూరు, పినపాక, అశ్వాపురం మండలాల్లో సిండికేట్ దందా జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు సిండికేట్ దందాను పట్టించుకోవడం లేదు. పైగా మాకేం సంబంధం లేదనట్లు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారుల తీరును చూసి ఈ మండలాల ప్రజలంతా నవ్వుకుంటున్నారు.





### దర్జాగా బెల్ట్ షాపులకు తరలిస్తున్న మద్యం

**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన మద్యం పాలసీ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తుంటే కొన్ని మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో బెల్ట్ షాప్ వ్యాపారులకు అక్రమంగా రవాణా చేస్తూ వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలు అనే విధంగా సాగిస్తున్నారు. ఇప్పడికైనా ఎక్సైజ్ ఉన్నత అధికారులు స్పందించి సిండికేట్ ముఠాపై చర్యలు తీసుకొని, సిండికేట్ ను రద్దు చేయాలని మండల ప్రజలు, ప్రజానాయకులు కోరుతున్నారు.**

# మంచిగా సదువుకోండి.. బిడ్డ

## పేద విద్యార్థుల చదువులకు ఆర్థికసాయం.. మరోసారి దాతృత్వాన్ని చాటుకున్న కేసీఆర్





హైదరాబాద్, నవతరం: ప్రమాదవశాత్తూ తండ్రులను కోల్పోయిన ఇద్దరు బడుగు బిడ్డలకు కేసీఆర్ భరోసా కల్పించారు. బీటెక్ ఇంజనీరింగ్ చదువు పూర్తి కోర్సుకు ఫీజు చెల్లింపు.. విడివిడిగా చెక్కులు అందజేశారు. విద్యుత్ ప్రమాదంలో ఇటీవల మరణించిన ఎర్రవెల్లి గ్రామ నివాసి పేద రైతు చిన్రాజు సత్తయ్య కుమారుడు, స్థానిక ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న నవీన్, అదే గ్రామానికి చెందిన, ప్రమాదవశాత్తూ కొన్ని సంవత్సరాల క్రితం మరణించిన మరో పేద రైతు పెద్దోళ్ల సాయిలు కొడుకు, బీటెక్ చదువుతున్న అజయ్‌లను చేరదీసి వారి ఇంజనీరింగ్ చదువు పూర్తికాలపు ఫీజులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెల్లించారు. వారికి అవసరమయ్యే పుస్తకాలు, కంప్యూటర్ల కోసం కూడా ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు వారికి విడివిడిగా చెక్కులు అందించారు. "కష్టపడి మంచిగా చదువుకోండి బిడ్డా.. మీరు కష్టపడి గొప్ప స్థాయిని చేరుకోవాలి. ఫీజుల కోసం భయపడొద్దు. ఏ సమస్య వచ్చినా నేనున్నా.." అంటూ భరోసా నిస్తూ కేసీఆర్ ఆశీర్వదించారు. కాగా.. విద్యుత్ ప్రమాదంలో మరణించిన చిన్రాజు సత్తయ్య కుటుంబానికి సంబంధిత విద్యుత్ శాఖ నుంచి చట్టపరంగా అందే ఆర్థిక తదితర సాయం గురించి పర్యవేక్షించి వారికి న్యాయం జరిగేలా చూడాలని తన వ్యక్తిగత కార్యదర్శి నాగేందర్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు. కాగా.. కుటుంబ పెద్దను కోల్పోయిన తమను గుర్తించి, ఆదరించి, ఆర్థికంగా ఆదుకుని, తమ పిల్లల చదువు, భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన కేసీఆర్ కు పిల్లల తల్లులు చేతులెత్తి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. తమ చదువుకోసం భరోసాగా నిలిచిన కేసీఆర్ కు ఎర్రవెల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

**సీనియర్ ఉర్దూ జర్నలిస్టు ఎం.ఎ. రహీం మృతి పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. విలువలతో కూడిన జర్నలిస్టుగా రహీం తన ప్రత్యేకతను చాటుకున్నారని, వారి మరణం ఉర్దూ జర్నలిజానికి తీరని లోటని కేసీఆర్ అన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.**

**- నవతరం, హైదరాబాద్**



### ఏపీలో మద్యం ధరల పెంపు.. బార్లపై అదనపు సుంకం రద్దు

**బార్లపై అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం (ఏఆర్ఈటీ) రద్దు**

**క్వార్టర్, బీర్లు మినహా ఇతర మద్యం బాటిళ్లపై రూ.10 పెంపు**

**రిటైలర్ల మార్జిన్‌ను 1 శాతం పెంచుతూ కేబినెట్ నిర్ణయం**

**ఈ మార్పులతో ప్రభుత్వానికి రూ.506 కోట్ల అదనపు ఆదాయం అంచనా**

**కొత్తగా మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం విధానంలో కీలక మార్పులు చేసింది. బార్లపై విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం (ఏఆర్ఈటీ)ను రద్దు చేస్తూ, అదే సమయంలో కొన్ని రకాల మద్యం ధరలను పెంచుతూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రిమండలి సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. తాజా నిర్ణయం ప్రకారం సామాన్యులు ఎక్కువగా వినియోగించే రూ.99 ఎంఆర్‌పీ (180ఎంఎల్) క్వార్టర్ బాటిళ్లు, బీర్లు, వైన్, రెడీ టూ డ్రింక్స్ (ఆర్‌టీడీ) ధరల్లో ఎలాంటి మార్పు ఉండదు. వీటిని మినహాయించి, మిగతా అన్ని సైజుల మద్యం బాటిళ్ల ఎంఆర్‌పీపై రూ.10 పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం షాపులు, బార్ల మధ్య దిగుమతి ధరల్లో ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి, ఒకే ధరకు మద్యం అమ్మేలా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏఆర్ఈటీని రద్దు చేయడం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.340 కోట్ల ఆదాయ నష్టం వాటిల్లుతుందని అంచనా. అయితే, మద్యం ధరలను పెంచడం ద్వారా ఈ నష్టాన్ని భర్తీ చేయడంతో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మార్పులన్నింటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా రూ.506 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటు మద్యం షాపుల లైసెన్సీలకు ఎమ్మార్పీపై మార్జిన్‌ను ఒక శాతం పెంచే ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధికి వెలుపల, 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న త్రీస్టార్ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి హోటళ్లలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

# బాగున్నారా.. అమ్మ

**రాష్ట్ర మహిళా మంత్రులకు.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆత్మీయ పలకరింపు.**

**ఇంటికి వచ్చిన అతిథులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాదర ఆహ్వానం**

**అతిథి మర్యాదలతో, పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆడబిడ్డలకు సంప్రదాయ సత్కారం.**





హైదరాబాద్, నవతరం: ?తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఆత్మీయ ఆహ్వానం పలికారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ.. పంచాయతీ రాజ్ అండ్ మహిళా, శిశు సంక్షమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లి నివాసంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. మరికొద్ది రోజుల్లో, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా, జాతరను సందర్శించాల్సిందిగా కోరుతూ కేసీఆర్ కు ప్రభుత్వం తరఫున వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా, శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేసిన మంత్రులు కేసీఆర్ కు మేడారం ప్రసాదం అందజేశారు. ?ఈ సందర్భంగా... తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్, శోభమ్మ దంపతులు, వారిని పసుపు కుంకుమ వస్త్రాలు, తాంబూలాలతో సంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. ?కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందు స్వీకరించిన మహిళా మంత్రులు, కాసేపు పరస్పర యోగక్షమాలు, ఇష్టాగోష్టి అనంతరం మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. ?కాగా.. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ సాదర ఆహ్వానం పలికారు.

# కేసీఆర్ కోటలో హస్తం హవా

**మెజార్టీ గ్రామాలలో కాంగ్రెస్ జయకేతనం**

**కాంగ్రెస్ శ్రేణుల సమిష్టి కృషితోనే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం**

**నీలం మధు ముదిరాజ్..**

**గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ సర్పంచ్ లకు ఘన సన్మానం..**





హైదరాబాద్, నవతరం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిస్తూ మెజార్టీ స్థానాలలో జయకేతనం ఎగురవేయడం సంతోషకారమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మెదక్ పార్లమెంటు పరిధిలోని సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన సర్పంచ్ లు, జిల్లా సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె కళ్యాణ లు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో కలిసి నీలం మధు ను చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన సర్పంచ్ లను, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులను ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు. గజ్వేల్ లో కాంగ్రెస్ తో నే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రజలు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తో పాటు కాంగ్రెస్ శ్రేణులు కృషి మరువలేనిదని కొనియాడారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మనోహరబాద్ గ్రామ సర్పంచ్ భాస్కర్ యాదవ్, జీడిపల్లి గ్రామ సర్పంచ్ నర్సన్న కృష్ణ, కొండాపూర్ గ్రామ సర్పంచ్ నూకల రాము, వెంకటాపూర్ అగ్రహారం గ్రామ సర్పంచ్ వెంకటేష్, గౌతజిగూడా గ్రామ సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు, సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**కూకట్పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా సి.యం రిలీఫ్ ఫండ్ ద్వారా కూకట్ పల్లి నియోజకవర్గం లో 29 మంది లబ్దిదారులకు రూపాయలు 11,58,500 చెక్కులను లబ్దిదారులకి అందజేశారు. - నవతరం, కూకట్పల్లి**


# ఏపీలో 13 మంది అధికారులపై ఏసీబీ కేసులు... సుప్రీం కీలక ఆదేశాలు

## 13 మంది ఏపీ అధికారులపై ఏసీబీ కేసులు ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసిన ఏపీ హైకోర్టు సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏసీబీ

ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 13 మంది ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసుల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తును కొనసాగించేందుకు సర్వోన్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. 2016-2020 మధ్య కాలంలో పలువురు ప్రభుత్వ అధికారులపై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలతో ఏసీబీ కేసులు నమోదు చేసింది. విజయవాడలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) ద్వారా ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే నాటికి సీఐయూను అధికారికంగా పోలీస్ స్టేషన్‌గా నోటిఫై చేయలేదని, కాబట్టి ఆ కేసులకు చట్టబద్ధత లేదని నిందిత అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వాదనతో ఏకీభవించిన హైకోర్టు, ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది.

**హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సుప్రీం**

హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఏసీబీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సాంకేతిక కారణాలతో అవినీతి కేసుల దర్యాప్తును అడ్డుకోవడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఇది న్యాయ వ్యవస్థకే అవమానకరమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ, దర్యాప్తు కొనసాగించాలని ఏసీబీని ఆదేశించింది. అయితే, 6 నెలల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని, ఈ సమయంలో అరెస్టు వంటి కఠిన చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి సాంకేతిక అంశాలపై దాఖలయ్యే పిటిషన్లను హైకోర్టులు విచారించరాదని కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది.




# ఇదే కదా ఇదే కదా ... నీ కథ!

### (ప్రవాస భారతీయ దివస్)

కూతురు అమెరికాలో.. అమ్మ అంబాజీపేటలో..
కొడుకు ఇంగ్లండ్ లో తండ్రి ఇరుకు సందులో..
నువ్వు ఇన్ఫోసిస్ నాన్నకేమో క్రైసిస్..
నువ్వు వీసాపై ఎక్కడో అమ్మ అంపశయ్యపై
నీ ఊళ్ళో..

నువ్వు రావు.. రాలేనంటావు..
నిజానికి రావాలని అనుకోవు..
టికెట్ దొరకదంటావు.. సెలవు లేదంటావు..
వస్తే తిరిగి రావడం కష్టమంటావు..
నువ్వు వచ్చేదాక పెద్ద ప్రాణం పోనంటుంది..
నీ రాక కోసం ఆ కళ్ళు గుమ్మం వైపే..
రావని తెలిసినా నాన్న అమ్మకు
ఆ కబురు చెప్పలేక.. కక్కలేక..మింగలేక..
మంచం చుట్టూ అటూ ఇటూ
అవతల ఆ తల్లి
ఇంకాసేపట్లో అటో ఇటో..!

వయసు వచ్చినప్పటి నుంచి డాలర్ డ్రీమ్స్..
పొద్దున లేస్తే ఆ ఊసే.. నీ కలల వెనకే
తల్లిదండ్రుల పరుగు.. వారి ఆశలన్నీ
నీ అమెరికా పయనంతోనే కరుగు..
బ్రతుకుతెరువు కోసం నువ్వక్కడ..
గుండె బరువుతో వారిక్కడ..
మొదట్లో రోజూ ఓ వాట్సప్ కాలు
రెండ్రోజులకో వీడియో ఫోను
పోను పోను కొంత విరామం
ఏంట్రా అంటే వర్కులోడు
అప్పటికే నిద్ర లేచి ఉంటాడు
నీలో ఓ మాయలోడు...
అక్కడ కొనుక్కున్న
కొత్త కారుతో నీ ఫోటో ఫోజు
ఇక్కడ డొక్కు స్కూటర్ తో
తంటాలే నాన్నకి ప్రతిరోజు..!

ఈలోగా అన్నీ బాగుంటే పెద్దలు కుదిర్చిన పెళ్లి..
లేదంటే అక్కడే ఓ మేరీతో మేరేజ్..
ఆలికి కడుపో కాలో వస్తే
ఆయాగా అమ్మకి వీసా
నాన్నకి నేను డబ్బులు పంపుతాలే అని భరోసా..!
ఎంత అమ్మయినా నీ పిల్లలకు నాన్నమ్మయినా
ఆమె నాన్నకు భార్య అక్కడ పెద్దాయన
రోజూ చెయ్యి కాల్చుకుంటున్నాడేమోనని
బెంగ..
ఆ దంపతులను అలా వేరుగా ఉంచి
మీ జంట మాత్రం టింగురంగ..!

మొత్తానికి అలా అమ్మ అవసరం కొంత తీరాక
అప్పుడిక ఆమె ఉంటే బరువు
ఈలోగా ముగుస్తుంది ఆమె వీసా గడువు..
ఆమె చేతిలో టికెట్ నాన్నకిమ్మంటూ
ఓ గిఫ్ట్ పేకెట్..!

ఇటు నిన్ను వదలి వెళ్ళలేక
అటు భర్తని విడిచి ఉండలేక
చెమ్మగిల్లిన కళ్ళతో
విమానం ఎక్కిన
అమ్మకి తెలియదు
అదే చివరి చూపని
ఊరెళ్ళాక కమ్మేసిన జబ్బు
నీళ్లలా ఖర్చయ్యే డబ్బు..
నువ్వు పంపుతావేమో..
కాని ఆ వయసులో
నాన్నకు శ్రమ..
నువ్వు వస్తావని
అమ్మకి భ్రమ..
వచ్చే ప్రాణం..
పోయే ప్రాణం..
చివరకు
అనివార్యమయ్యే
మరణం..
వాడు వస్తున్నాడా.. ఏమంటున్నాడు..
ఊపిరి వదిలే వరకు
అదే ప్రశ్నతో అమ్మ..
నిర్జీవమైన ఆ కళ్ళలో
నీ బొమ్మ.. కొరివి పెట్టాల్సిన
నువ్వు సీమలో...
నాన్న కర్మ చేస్తుంటే
ఖర్మ కాలి చూసేస్తావు
లైవ్ లో..
అస్తికల నిమజ్జనం అంటూ
నాన్న కాశీకి పయనం
అంత శ్రమ ఎందుకు..
పక్కనే ఉంది కదా
గోదారని నీ అనునయం..,!

ఇప్పుడిక నాన్న కథ..
ఉన్న ఊరు..
కట్టుకున్న ఇల్లు
ముఖ్యంగా ఆ ఇంట్లో
అమ్మ జ్ఞాపకాలు
వదిలి రాలేక..
ఒంటరి బ్రతుకు ఈద్వలేక..
కష్టాలకు ఓర్వలేక..
ఓ రోజున
ఆయన కథా కంచికి
ఈసారి వస్తావు..
కొరివి పెట్టి
ఊళ్ళో ఇల్లు అమ్మేసి
ఉన్న ఊరు..కన్న తల్లి..
అన్నిటితో రుణం తెంచుకుని
నేను ఎన్నారై..
మిగిలినవన్నీ
జాన్తా నై..
అంటూ
పుట్టిన గడ్డను వదిలి
పెట్టిన గడ్డకు
శాశ్వతంగా వలస
ఇదే కదా
చాలామంది వరస..!

(అన్ని కథలూ ఇలాగే
ఉంటున్నాయని కాదు..
కానీ చాలా ఇళ్ళలో
ఇదే బాగోతం.!
సంపాదనపై మోజుతో
విదేశాలకు వెళ్ళడం..
ఇక్కడి కన్నా
అక్కడ జీవితం
చాలా గొప్పగా
ఉంటుందంటూ
సన్నాయి నొక్కులు..
మారిపోయే దృక్కులు..
అక్కడి నుంచి మేజిక్కులు..జిమ్మిక్కులు..
ఎక్కడ ఉన్నా
తల్లిదండ్రులను
నెత్తిన పెట్టుకుని
చూసే పిల్లలూ..

ఈ దేశంలో ఉండి కూడా పట్టించుకోని సంతానమూ లేకపోలేదు.అయితే పూర్తిగా అలాగే ఉంటున్న బిడ్డల గురించే ఈ ఆవేదన..

కాస్తయినా
మారండని నివేదన)

ఇంకో మాట..
మన ఎన్నారైలలో

ఎందరు విదేశాల్లో సమకూర్చుకుంటున్న సంపదలో గాని..

సముపార్జించుకుంటున్న

విజ్ఞానంలో గాని కొంతైనా మాతృదేశం కోసం వెచ్చిస్తున్నారు చెప్పండి..

ఏదో ఒకరోజున పంచెలు కట్టి..చీరలు చుట్టి భారతదేశ సంస్కృతీ వైభవాన్ని పరిరక్షిస్తున్నామని గొప్పగా చెప్పుకోవడం తప్ప..

అక్కడ బాగా సంపాదించి
ఇక్కడికి వచ్చి దేశానికి
ఉపయోగపడేలా చేస్తామని
చెప్పే ఎందరో ఏం చేస్తున్నారో
మనం చూస్తూనే ఉన్నాం..)

**ఇ.సురేష్ కుమార్**
**9948546286, 7995666286**
**- నవతరం :విజయనగరం**

## ఎడిటోరియల్



**ఆరావళిపై సాగుతున్న అరాచకంపై ప్రజలు మేల్కొని ఉద్యమబాట పట్టడంతో కథ అడ్డం తిరిగింది. అంటే ప్రజా ఉద్యమాలకు బలం ఉందని తేలింది. ప్రజా ఉద్యమాలను న్యాయస్థానాలు సైతం అంగీకరిస్తున్నాయి. అందువల్ల సమస్యలపై ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పోరాటం చేయాల్సిందేనని ఆరావాళి మనకు హెచ్చరించింది. ఇది ఆరంభంగా తీసుకోవాలి. దేశంలో ఎక్కడిక్కడ ప్రజలు దేశ పర్యావరణ విధ్వంసంపై ఉద్యమించాలి. నదుల అనుసంధనం ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు నడుం బిగించాలి.**

క్యాన్సర్ కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. అన్నింటికి మించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం అవసరం. ఇదంతా ఎందుకు చర్చించుకోవాలంటే ఆరావళిని కార్పోరేట్లకు ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సుప్రీం ఆదేశాలతో అక్కడ తవ్వకాలకు స్వస్తి పలికింది. సహజసిద్దంగా, భారత్‌కు రక్షణ గోడలా ఉన్న ఆరావళి పర్వతాల్లో తవ్వకాలకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు,

# ఆరావళికి విజయోస్తు !

ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా సైతం వ్యతిరేకించడం విశేషం. ప్రజాందోళనలు అంతకంతకూ మృగ్యమైపోతున్న ప్రస్తుత కాలంలో ఉదయ్‌పూర్ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం రాజుకోవడం, పర్యావరణవేత్తలు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆరావళిని కాపాడేందుకు నడుం బిగించారు. కార్పొరేట్ లాభాలు తాత్కాలికమైనవి. పర్యావరణ నష్టాలు శాశ్వతమైనవని గుర్తించారు. అందుకే ఆరావళి జోలికి రాకుండా ఉద్యమించారు. ఢిల్లీ కాలుష్యంలో ఊపిరిసలుపక అవస్థలు పడుతున్న కేంద్ర పెద్దలు అరావళిని తమ తాబేదార్లకు తెగనమ్మే దిశగా అడుగులు వేయడం విస్మయం కలిగించక మానదు. ఎందుకంటే ఇప్పటికీ ఢిల్లీ కాలుష్య నివారణపై కదలిక కానరావడం లేదు. కాలుష్యం మూలాలను కనిపెట్టడం లేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా, ప్రజలు ఆందోళన చెందుతున్నా కార్యాచరణ శూన్యం ఈ దశలో ఆరావళిపై జరిగిన పోరాటం గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. ఆలస్యంగానైనా లెంపలు వేసుకుని అరావళి రక్షణపై, ముఖ్యంగా గనుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఉత్తర్వులు జారీచేయడం ప్రజాభీష్టానికి లభించిన ఘనవిజయంగా చూడాలి. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని నిరూపితం అయ్యింది. ర్యావరణ పరిరక్షణకూ అప్రమత్తతే రక్షణ కవచమని ఇప్పుడు ఆరావళి సాక్షిగా తేలిపోయింది. ఆరావళి పర్వతాలకు ప్రస్తుతానికైతే ముప్పు తప్పింది. కార్పొరేట్ గద్దలకు ప్రకృతి సంపదను దోచిపెట్టాలన్న దురాలోచన వెనుకపట్టు పట్టింది. ఎత్తు పేరుతో పర్యావరణాన్ని చిత్తు చేయాలన్న ఎత్తుగడ ప్రజాగ్రహం ముందు వీగిపోయింది. ఎడతెగని రైతుల పోరాటం ఫలితంగా కార్పొరేట్లకు సాగును కట్టుబానిసను చేయాలన్న పన్నాగం విఫలమై నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్టే, దేశవ్యాప్తంగా రగులుతున్న ఆరావళి నిరసనలకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఎక్కడో పర్వతాలు, అడవులు.. ఎవరు తవ్వుకుంటే మనకేమి అనుకునే రోజులు కావివి. భూమి మీద ఉండే ప్రతి పుట్టా, చెరువూ దేనికవే పర్యావరణ వ్యవస్థలకు ఆయువుగా నిలిచి ప్రాణాధారాలుగా పనిచేస్తాయి. భూమి మీదున్న అతిపురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళికి ఉన్న ప్రాముఖ్యం తెలియంది కాదు. మన పురాణాలు, ఉపనిషత్తులు, వేదాల్లో దీని ప్రస్తావన ఉంది. మన దేశానికి ఉత్తరాన పెట్టని కోటగోడలా నిలుస్తున్న హిమాలయాల కంటే ఆరావళి పర్వతాలే పురాతనమైనవి. దాదాపు 700 కిలోమీటర్ల పొడవున్న ఈ పర్వతశ్రేణి మరో రకంగా రక్షణ దుర్గంలా నిలుస్తున్నది. పడమర నుంచి తూర్పు ప్రాంతాలకు వీచే

వేడిగాలుల ప్రభావాన్ని తగ్గించి, థార్ ఎడారి విస్తరణకు లక్ష్మణరేఖలా నిలువడం దీని ప్రత్యేకత. రాజస్థాన్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలను చల్లగా చూసే కొండదేవరగా ఆరావళిని చెప్పుకోవచ్చు. ఇక కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఊపిరితిత్తుల్లాంటివని చెప్పకతప్పదు. అలాంటి ఆరావళిని కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తులు ఇప్పటికే మైనింగ్‌తో, చెట్ల నరికివేతతో చెరపట్టి చేయాల్సిన నష్టం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వాలు వేల ఎకరాల అడవులను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన కేంద్రం మరింతగా దూకుడు పెంచి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని చూసింది. దీనివల్ల మనకు తీరని నష్టం అని తెలిసినా పట్టించుకోలేదు. ఆరావళిని అంగడి సరుకుగా మార్చేందుకు, గనుల తవ్వకానికి రాచబాట పరిచేందుకు మోదీ సర్కార్ చేసని ప్రయత్నాలపై దెబ్బపడింది. వంద మీటర్ల ఎత్తువరకు మాత్రమే తవ్వకాలు జరపొచ్చని, అంతకన్నా ఎత్తున్నవి మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని వితండవాదం చేసింది. శాస్త్రీయ విధానంలో ఏది అడవి, ఏది కాదనేది తేల్చిచెప్పాల్సిన కేంద్రమే ఎత్తును బట్టి అనుమతులను నిర్ధారించడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి తోవ వేసింది. ఎత్తును బట్టి ఆరావళి పర్వతాలకు నిర్వచనమిచ్చే విధానాన్ని సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా నియమించిన కమిటీ కూడా తిరస్కరించింది. దాన్ని తోసిరాజని కోర్టు ముందు సలహాదారుగా ఆ ప్రతిపాదనే ఉంచి పక్కదారి పట్టించింది. అయితే ప్రజా ఉద్యమాన్ని కోర్టు కూడా పరిగణించింది. ఆరావాళి జోలికి వెళ్లవద్దని తేల్చింది. ఆయా రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఢిల్లీ కాలుష్యంపై ప్రజలు పోరాడాలి. అప్పుడే దేశానికి విముక్తి కలుగుతుంది. కాలుష్యంతో ఢిల్లీలో ఉండలేక పోతున్నానని కేంద్రమంత్రి నితిని గడ్కరీ స్వయంగా చెప్పడం చూస్తుంటే ఢిల్లీలో ఎంతటి దారుణ పరిస్థితులు ఉన్నాయో గమనించవచ్చు. అందువల్ల కేంద్రమే స్వయంగా రంగంలోకి దిగి రాజధానిని కాలుష్యం నుంచి బయటపడేసే మార్గాలను వెతకాలి.

# టిడిపిలో కష్టపడ్డ వారందరికీ గుర్తింపు

తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలు నాయకులు వారి చేసిన సేవలను గుర్తించి టిడిపి అధిష్టానం తగిన పదవులు ఇస్తోందని రాయచోటి టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు .శుక్రవారం రాజంపేట పార్లమెంటు పరిధిలో పదవులు పొందిన పలువురు టిడిపి నేతలు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ని కలసి సెలవులతో సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూరాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి రామాపురం టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేందర్ రెడ్డి రాజంపేట పార్లమెంట్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరమణ లుకృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల టిడిపి అధిష్టానం పార్లమెంట్ కమిటీలు ప్రకటించగా అందులో పార్లమెంట్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంపల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాయచోటి లోని టిడిపి పార్టీ కార్యాలయంలో లక్ష్మీ ప్రసాద్ రెడ్డి రామాపురం టిడిపి అధ్యక్షులు గాలివీటి సురేందర్ రెడ్డి రాజంపేట పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరమణ లు శాలవ కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్

ఈ సందర్భంగా నూతనంగా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాధ్యతలు చేపట్టిన మమత లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అభినందనలు తెలుపుతూ సత్కరించారు. పార్టీ కి ఆమె చేసిన సేవలకు తగిన పదవి లభించిందని, పార్టీ

మాట్లాడుతూ పార్టీ లో కష్టపడిన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా గుర్తింపు ఉంటుంది అని, పార్టీ కోసం పని చేయడం గొప్ప అదృష్టం గా భావిస్తున్నాను అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ



మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో టిడిపిని బలోపేతం చేయాలని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి పార్టీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవదర్శన్ రెడ్డి, కుమ్మరపల్లి టిడిపి నాయకులు నందలూరు కోటిరెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి రామకృష్ణ గౌడ్, కదిరి నరసింహులు, రామాపురం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు పోశాల దర్బార్, నాయకులు పోశాల శ్రీనివాసులు, పో శాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారుశుక్రవారం మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి గ్రామంలో గల టిడిపి సీనియర్ కార్యకర్త బడుగు రామయ్య సోదరుడు నరసింహులు మృతి చెందడంతో వారి భౌతికకాయానికి నివాళు లర్పించి,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మండల గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మమతారెడ్డి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డిరాయచోటి టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మమతా మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నాకు పదవి ఇవ్వడం ఆనందంగా ఉందని ఇది మరింత బాధ్యతను పెంచుతుందని పేర్కొన్నారు రాబోయే కాలంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుమార్ రెడ్డి, శివారెడ్డి మండల టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు..పట్టణంలోనే మదనపల్లి రోడ్డు నందుగల డాక్టర్ రామరాజు ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని వారి ఇంటి దగ్గరికి వెళ్లి వారిని పరామర్శించి,ధైర్యం చెప్పిన నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి.పట్టణంలోనే మంత్రిక్యాంప్ కార్యాలయం నందు నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన రమ్యతేజ ను రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి గా నియమించడానికి సహకరించిన రాష్ట్ర మంత్రివర్యులుమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజకవర్గం టీడీపీ నాయకులు డాక్టర్ "మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి" ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేశారు.ఈ సందర్భంగా రమ్య తేజ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలవతో సన్మానించారు.. ఈ సందర్భంగా

అధ్యక్షుడు మదనమోహన్ మరియు పట్టణ టిడిపి అధ్యక్షుడు బోనమల ఖాదరవల్లి మరియు కూటమి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి ఎంవి రమణ యాదవ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి రాయచోటి టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా పార్టీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన ఎంవి రమణ యాదవ్కు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అభినందనలు తెలుపుతూ సత్కరించారు. పార్టీ కి ఆయన చేసిన సేవలకు తగిన పదవి లభించిందని, పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమణ యాదవ్ మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి నాకు పదవి ఇవ్వడం ఆనందంగా ఉందని ఇది మరింత బాధ్యతను పెంచుతుందని పేర్కొన్నారు రాబోయే కాలంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి కృషి చేస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎండపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు జనార్దన్ రెడ్డి, కాలేజీ రాజా, ఎరికిల డెవలప్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కంప శేఖర్, సోడి వెంకటేశ్వర యాదవ్ పాల్గొన్నారు

## తమ్మినేనికి చెక్...

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటుతోంది. నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ల విషయంలో నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రకంపనలు రేపుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో తాజాగా సీనియర్ నేత ధర్మాన కృష్ణ దాస్ చేసిన ప్రకటన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టినట్టు ఉంది. సీనియర్ నేతగా ఉన్న ధర్మాన కృష్ణ దాస్.. ఆ జిల్లా పార్టీ అధ్యక్షుడు కూడా. అయితే వచ్చే ఎన్నికల్లో తమ్మినేని పోటీ విషయంలో ఆయన చేసిన ప్రకటన మాత్రం పొలిటికల్ వర్గాల్లో హీట్ రేపుతోంది. వచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారామును తప్పించి మరొకరిని పోటీ చేయిస్తామన్న ధర్మాన కృష్ణ దాస్ ప్రకటనపై దువ్వాడ శ్రీనివాస్ విభిన్న ప్రకటనలు చేస్తున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తున్నారు.కొద్దిరోజుల కిందట దువ్వాడ శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసింది హై కమాండ్. వ్యక్తిగత కుటుంబ వివాదాలతో ఆయనపై వేటు వేయాల్సి వచ్చింది. అయితే దీని వెనుక ధర్మాన బ్రదర్స్ కుట్ర ఉంది అన్నది దువ్వాడ చేస్తున్న ఆరోపణ. కింజరాపు కుటుంబంతో కలిపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపణ చేస్తున్నారు. తన ఓటమి వెనుక ధర్మాన కుటుంబ హస్తం ఉందని కూడా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మాన బ్రదర్స్ పై పెద్ద యుద్ధమే ప్రకటించారు దువ్వాడ. దానికి కాళింగ సామాజిక వర్గం ను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం మొదలుపెట్టారు. ఆ సామాజిక వర్గం ద్వారానే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇవ్వడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు.అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉండేవారు. ఆయనను తప్పించి యువకుడైన చింతాడ రవికుమార్ కు ఆ బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. అప్పటినుంచి తమ్మినేని సీతారాం కూడా మనస్థాపంతో ఉంటూ వస్తున్నారు. ఆయన సైతం కాళింగ సామాజిక వర్గానికి చెందిన నేత. ఇటువంటి పరిస్థితుల్లో టెక్కలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశానికి జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరయ్యారు కృష్ణదాస్. ఈ క్రమంలో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో రామ్మోహన్ నాయుడుకు ధీటుగా సరైన అభ్యర్థిని రంగంలోకి దించుతామని చెప్పుకొచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఎంపీగా తమ్మినేని పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనకు పెద్దల సభకు కానీ ఎమ్మెల్సీ పదవి గానీ ఇస్తామని కృష్ణ దాస్ చెప్పడం దువ్వాడ శ్రీనివాస్ ఆయుధంగా మలుచుకున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తరుపైకి తెస్తూ.. కింజరాపు, ధర్మాన బ్రదర్స్ ను కేడి బ్రదర్స్ తో పోల్చారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నేరుగా హెచ్చరించలేదు. కానీ ధర్మాన బ్రదర్స్ కు హెచ్చరించడం ద్వారా హై కమాండ్ కు పరోక్ష సంకేతాలు పంపగలిగారు.

గంటా శ్రీనివాసరావు. టీడీపీలోనూ, ప్రజారాజ్యంలోనూ, కాంగ్రెస్‌లోనూ..ఎక్కడున్నా కీలక పదవుల్లో కొనసాగారు. రెండు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో ఉన్న ఆయన ఓటమి ఎరుగని నేతగా పేరు సంపాదించారు. అయితే 2024 ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేసి గెలిచిన గంటా మళ్లీ మంత్రి కావాలనుకున్నారు. కానీ ఆ ఆశ నెరవేరడం లేదు. గంటాకు మంత్రి పదవి దక్కకపోవడానికి చాలా రీజన్స్ ఉన్నాయని చర్చ జరుగుతోంది.సామాజిక వర్గ సమీకరణాల్లో భాగంగా గంటాకు అమాత్య యోగం దక్కలేదని కొందరు చెబుతున్నా, అసలు అధిష్టానమే ఆయన్ను పక్కన పెట్టిందన్న టాక్ ఉంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అంటీముట్టనట్లుగా వ్యవహరించారని ..చంద్రబాబు అరెస్ట్‌పై గంటా రియాక్ట్ కాలేదని ఆయనపై పార్టీ అధిష్టానం అసంతృప్తిగా ఉందట.టీడీపీని వీడి వైసీపీలో చేరేందుకు గంటా శ్రీనివాసరావు ప్రయత్నాలు చేశారని అప్పట్లో ప్రచారం బాగా జరిగింది. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ అధిష్టానం గంటాను పక్కన పెట్టేసిందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకంగా ఉన్న మంత్రి లోకేశ్ కూడా గంటాను దగ్గరకు రానివ్వడం లేదట. 2014 హయాంలో చంద్రబాబు కాకుండా లోకేశ్ నాయకత్వాన్ని అప్పట్లో గంటా మనస్ఫూర్తిగా స్వాగతించలేకపోగా, ఎడమొహం పెడమొహంగా ఉండేవారట. ఈ పరిస్థితలన్నింటినీ గమనించిన లోకేశ్ ఇప్పుడు గంటాకు మంత్రి పదవి ఇవ్వలేదనే టాక్ నడుస్తోంది.గతంలో రెండుసార్లు మంత్రి, ఓ సారి ఎంపీగా..విశాఖలో బుగ్గకారులో రయ్ రయ్‌మంటూ తన హవాను నడిపించిన గంటా, ఇప్పుడు కేవలం ఎమ్మెల్యేగా పరిమితం కాలేకపోతున్నారట. పోనీ తర్వాత ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ జరిగితే ఛాన్స్ వస్తుందా అంటే అదీ డౌటేనని తెలిసిపోయిందట.తన సహచరులైన అయ్యన పాత్రుడు స్పీకర్‌గా,

# భీమిలీలో వారుసుడికి లైన్ క్లియర్


ఒకప్పుడు తాను ఎమ్మెల్యే సీటు ఇప్పించిన ఎమ్మెల్యే వంగలపూడి అనిత హోంమంత్రిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బుగ్గ కార్లలో తిరుగుతుంటే..తాను మాత్రం ఎమ్మెల్యేగా మిగిలిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. దీంతో గంటా తన పొలిటికల్ బ్రెయిన్‌కు మళ్లీ ఇప్పుడు పని చెప్పారట. అందుకే ఇక రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టి, తన కుమారుడు రవితేజను పొలిటికల్ స్క్రీన్ మీదకు తీసుకురావాలని తహతహలాడుతున్నారని గంటా క్లోజ్ సర్కిల్స్ టాక్.నిజానికి తన కుమారుడు రవి తేజను సిల్వర్ స్క్రీన్‌పై చూడాలని గంటా కోరిక. హీరోగా సినీ రంగంలో నిలబెట్టాలని గంటా ప్రయత్నాలు చేశారు. జయదేవ్ పేరిట గతంలో రవితేజ హీరోగా సినిమా తీశారు. మెగాస్టార్ చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులతో తనకున్న సన్నిహిత సంబంధాలు కలిసి వస్తాయని భావించారట. అయితే ఆ జయదేవ్ మూవీ మొదటి షోతోనే ముగిసిపోవడంతో, ఇక పొలిటికల్ ఫీల్డే బెటర్ అనే నిర్ణయానికి వచ్చారట. అప్పటి నుంచి గంటాకు తోడుగా అడపాదడపా మాత్రమే రాజకీయాల్లో రవితేజ కనిపించేవారు.ఇప్పుడు సీన్ మారింది. గంటా కంటే ఎక్కువగా ఆయన కుమారుడు రవితేజనే భీమిలిలో ఎక్కువగా కనిపిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచినా, తల్లికి వందనం నిధులు మంజూరు చేసినా, అన్నదాత సుఖీభవ, ఫ్రీ గ్యాస్, ఉచిత బస్ వంటి పథకాల్ని ప్రారంభించినా సరే రవితేజ యాక్టీవ్‌గా భీమిలి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. అలాగే నియోజకవర్గానికి సంబంధించిన కీలక అంశాలపై రవితేజనే అధికారులతో మాట్లాడుతున్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రవితేజ దగ్గరుండి ప్రచారం చేశారు.అలాగే భీమిలి టీడీపీ, జనసేన క్యాడర్‌లో తన పట్టు పెంచుకునేందుకు, అందరికీ అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తున్నారు రవితేజ. ఇదంతా చూస్తున్నవారికి గంటా స్కెచ్ ఏంటో అర్థమైపోయిందట. వచ్చే ఎన్నికల నాటికి తాను ఎంపీగానో మరో పదవికి వెళ్లిపోయి, తన కుమారుడుని లోకేశ్ టీమ్‌లో చేర్పించి మంత్రిని చేయాలనే ఎత్తుగడలో భాగంగానే..భీమిలిలో రవితేజను యాక్టీవ్ చేశారని అంటున్నారు. ఇటు గంటా కుమారుడిగా, అటు మంత్రి నారాయణ అల్లుడిగా కూడా రవితేజకు రాజకీయ బలగం కలిసి రాబోతుందన్న టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి రవితేజను అసెంబ్లీకి పంపి తర్వాత మంత్రిని చేయడం పక్కా అని గంటా అనుచరులు కూడా లెక్కలు వేసుకుంటున్నారట. మరి గంటా శ్రీనివాసరావు స్కెచ్ వర్కౌట్ అవుతుందో లేదో చూడాలి మరి.

# హైప్‌ను క్రియేట్ చేస్తున్న స్పిరిట్

## బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తి



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'స్పిరిట్'. ఈ మూవీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే భారీ స్థాయిలో హైప్‌ను క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సందీప్ రెడ్డి స్వయంగా ఒక షాకింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ మూవీ షూటింగ్ త్వరలో మొదలవుతుందన్నారు. ఇప్పటికే బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. యానిమల్ -ట్రైంలో మాదిరిగానే ముందుగా మ్యూజిక్ వర్క్ పూర్తిచేస్తే, సీన్ అవుట్‌పుట్ ఎలా వస్తుందో ముందే అర్థమవుతుంది. ఇది -టైమ్, ప్రొడక్షన్ బడ్జెట్ రెండింటినీ ఆదా చేస్తుంది అని అన్నారు. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా నిజాయితీగలవాడు, కోపం లేకుండా పని చేసే వ్యక్తి. స్టార్ అన్న అహంకారం ఆయనలో ఏమాత్రం లేదు. నేను ఊహించిన దానికన్నా ఎక్కువగా ఆయన ఈ సినిమాకు సహకరిస్తున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వస్తాం అని అన్నారు. 'బాహుబలి 2' ఇంటర్వెల్ సీన్ చూసిన తర్వాత తనకు 'అర్జున్ రెడ్డి' విషయంలో భయం వేసిందని దర్శకుడు సందీప్ వంగా అన్నారు. రామ్ గోపాల్ వర్మ గురించి సందీప్ మాట్లాడుతూ.. ఆయన ఎన్నో విషయాల్లో నాకు గురువు. ఆయన చిత్రాలు చూసి తెలియని విషయాలు నేర్చుకున్నా. 'సత్య' సినిమా 50, 60 సార్లు చూశాను. అది చూసే ఎడిటింగ్ నేర్చుకున్నా అని చెప్పారు. నేను ఇప్పటి వరకూ చూసిన సినిమాల్లో 'బాహుబలి 2' ఇంటర్వెల్ హైలైట్. దానికి మించిన ఇంటర్వెల్ సీన్ ఇప్పటి వరకూ లేదు. అది చూసి నా స్టూడియోకు వచ్చి 'అర్జున్ రెడ్డి' ఇంటర్వెల్ సీన్ చూశాను. ప్రేక్షకులకు నచ్చుతుందా లేదా అని ఒక్క నిమిషం భయం వేసింది. ఇంటర్వెల్ కూడా గొప్పగా ఉండాలని రాజమౌళి నిరూపించారు. 'అర్జున్‌రెడ్డి' -ట్రైలర్ విడుదలయ్యాక ప్రేక్షకుల స్పందన చూసి నాకు ధైర్యం వచ్చిందని చెప్పారు. ఇక 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించ నున్నారని సమాచారం. ఇందులో ఒక పాత్ర పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కాగా, రెండోది ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో మాఫియా డాన్. ఈ మాస్ మిక్స్ క్యారెక్టర్స్‌తో సినిమా హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి హిట్స్ ఇచ్చిన సందీప్ నుంచి ఇది మరో బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో చేస్తున్న ది రాజా సాబ్ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది. మరోవైపు ఫౌజీ (హను రాఘవపూడి డైరెక్షన్‌లో) చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'స్పిరిట్' కోసం సందీప్ రెడ్డి పెట్టిన కండిషన్ ప్రకారం, ప్రాజెక్ట్ ప్రారంభమైన తర్వాత ప్రభాస్ వేరే సినిమా చేయకూడదు. ప్రభాస్ దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు- సమాచారం. అందుకే షూటింగ్ షెడ్యూల్స్ అందుకు అనుగుణంగా ప్లాన్ చేస్తున్నారు.




# ట్రైలర్ రెడీ

రిషబ్ శెట్టి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్1'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించగా, గుల్షన్ దేవయ్య, జయరాం ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. హొంబలే ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను రేపు (సెప్టెంబరు 22) రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను ప్రభాస్, హిందీ ట్రైలర్‌ను హృతిక్ రోషన్, తమిళ ట్రైలర్‌ను శివకార్తికేయన్, మలయాలం ట్రైలర్‌ను పృథ్వీరాజ్ సుకు మారన్‌లు డిజిటల్‌గా విడుదల చేయనున్నారు. "ఈ సినిమా కోసం 3వేలమంది ప్రజలు, 500 మంది యోధులు పాల్గొన్న ఓ భారీ యుద్ధ సన్నివేశాన్ని తెరకెక్కించాం. ఇందుకోసం 25 ఎకరాల స్థలంలో ఓ పట్టణాన్ని నిర్మించి, దాదాపు 50 రోజుల పాటు షూటింగ్ చేశాం. భారతీయ సినిమా చరిత్రలోనే అతి పెద్ద సన్నివేశాల్లో ఈ యుద్ధ సన్నివేశం ఒకటిగా నిలుస్తుంది. 'కాంతార' ('కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం తెరకెక్కింది) విజయాన్ని కొనసాగించడంలో హొంబలే ఫిలింస్ రాజీ పడటం లేదు. ఆడియన్స్‌కు థియేటర్స్‌లో గొప్ప అనుభూతిని ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. కన్నడతో పాటు హిందీ, తెలుగు, మలయాళ, తమిళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం అక్టోబరు 2న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.



# రామ్‌చరణ్‌తో జోడీ?

హీరో రామ్‌చరణ్‌కి జోడీగా బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' అనే పాన్‌ఇండియా సినిమాలో నటిస్తున్నారు రామ్‌చరణ్. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 మార్చి 27న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. 'పెద్ది' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు రామ్‌చరణ్. 'ఆర్‌సీ 17' అన్నది వర్కింగ్ టైటిల్. 'రంగస్థలం'(2018) వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్‌చరణ్%-%సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఇది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రోడక్షన్ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు సుకుమార్. 'పెద్ది' షూటింగ్ పూర్తయిన వెంటనే ఏమాత్రం విరామం లేకుండా 'ఆర్‌సీ 17'ని సెట్స్‌కి తీసుకెళ్లనున్నారట రామ్‌చరణ్%-% సుకుమార్. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు? అనే విషయంపై ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన రాలేదు.అయితే రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్‌ని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట సుకుమార్. మహేశ్ బాబు హీరోగా నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమా ద్వారా కృతీసనన్‌ని తెలుగుకి పరిచయం చేశారు సుకుమార్. ఆ తర్వాత 'దోచెయ్, ఆదిపురుష్' వంటి తెలుగు సినిమాల్లో నటించారు కృతీసనన్. ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీని 'ఆర్‌సీ 17' ద్వారా మరోసారి టాలీవుడ్‌కి తీసుకురానున్నారట సుకుమార్. మరి రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్ నటిస్తారా? లేదా? అనే విషయం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.



# సంబరాలు వాయిదా

సాయి దుర్గాతేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. రోహిత్ కేపీ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ గతంలో ప్రకటించారు. కానీ 'సంబరాల ఏటిగట్టు' సినిమా రిలీజ్‌ను వాయిదా వేశామని, త్వరలోనే కొత్త విడుదల తేదీ ప్రకటిస్తామని శనివారం ఓ నోట్‌ను విడుదల చేశారు మేకర్స్. "సినీ కార్మికుల సమ్మె, కీలకమైన సీజీ వర్క్ పెండింగ్... వంటి కారణాల వల్ల మా సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నాం. క్వాలిటీ పరంగా రాజీ పడాలనుకోవడం లేదు" అని చిత్రయూనిట్ పేర్కొంది.

# ఒకే ఒక లోకం చిత్రం ట్రైలర్, పోస్టర్ లాంచ్



కోరిటాల రోహిణి సమర్పణలో ప్రకాశంబుల్స్ ఆర్ట్స్ ప్రొడక్టన్స్ పతాకంపై కోరిటాల సాయిచౌదరి నిర్మించి,వై.విషు? నారాయణ దర్శకత్వం వహించిన "ఒకే ఒక లోకం"చిత్రం ట్రైలర్, మరియు పోస్టర్ కార్యక్రమం నిర్మాత, డైరెక్టర్, హీరో, హీరోయిన్, ముఖ్యఅతిధుల సమక్షంలో విడుదల అయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా లయన్ సాయివెంకట్ గారు పాల్గొని ట్రైలర్ లాంచ్ చేసి ఈ సినిమా విజవంతం అవ్వాలని కోరుకున్నారు. ప్రొడ్యూసర్ కోరిటాల సాయిగారు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చేసాం ఆదరించాలి అని కోరారు. డైరెక్టర్ విషు?నారాయణ మాట్లాడుతూ, ఇది కాలేజీ బ్యాక్ గ్రౌండ్ స్టోరీ అని,చాలా చక్కగా కుదిరిందని, ఈ చిత్రంలోలోని ఆర్టిస్టులు కొత్త వారైనా అందరూ ఎంతో సహకరించారని, ఈ చిత్రంలో ని పాటలు అదుతేంగా ఉంటాయని, ఇది మ్యూజికల్ హిట్ సినిమా అని, దీన్ని ప్రేక్షకులు విజయంవంతం చెయ్యాలని కోరారు.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com